# ద్రౌపది వస్త్రాపహరణము



"అనుకున్న యిన్నాళ్లకు ద్రౌపదీవస్త్రాపహరణము జూడ తటస్థించినది. ఇదన్న యింతటిలో సిద్ధించునని అనుకొనలేదు." అని నేను సినిమా హాలులోనికి ప్రవేశించి, కుర్చీని చేతిరుమాలుతో దులుపుకొనుచు కూర్చుచున్నాను.

"అనుకున్న యిన్నాళ్ళకు నీకు ద్రౌపదీవస్త్రాపహరణము జూచుట సిద్ధించినది. కాని అనుకొనకుండనే ద్రౌపదికి వస్త్రాపహరణము సిద్ధించినది. సిద్ధించెడివి అనుకున్నా సిద్ధిస్తవి. అనుకోకుండావున్న సిద్ధిస్తవి" అని మోహానుడనుచు నాప్రక్క కుర్చీలో కూర్చున్నాడు.

"బాగా సెలవిచ్చారు. అనీ అనుకొనుట ఏమి. అనుకొనుచు అనుకొనకపోవడమేమి. అనుకుంటూ అనుకుంటూనే నాకుకూడ సిద్ధించినది" అన మా ఎదుటివరుస కుర్చీలలో కూర్చున్న నొకవ్యక్తి మావైపు తిరిగి అన్నాడు.

"మీకూ సిద్ధించినదా వస్త్రాపహరణము!!" అని మోహానుడు తన కొంటెతనమును పోనియ్యకన్నాడు.

"చంపారు. వస్త్రాపహరణము కాదు. కన్నాంబ ద్రౌపది వేయగా వస్త్రాపహరణము జూచుట" అని అన్నాడు.

"ఎవరండి మీరని" నేను ఆవ్యక్తి నడిగితిని.

---

శ్రీ నాయని శేషాచలరావు బి. ఏ.

"నేనొక ఆర్టిస్టును. పటములు బొమ్మలు వ్రాసెడివాడను. ఈమధ్య కొన్నిపటములుకూడ ఎగ్జిబిషన్ (Exibition)కు పంపించాను" అని తన స్వీయచరిత్రమును అతి సూక్ష్మముగా ముగించాడు.

హాలంతయు జనముతో క్రిక్కిరిసివున్నది. మా ప్రక్కనే స్త్రీలు కూర్చునే కుర్చీ స్థలము. జర్మనీలు రైన్‌లండను ఆక్రమించుకున్నట్లు ఆ స్థలమును స్త్రీలు ఆక్రమించుకున్నారు. వారి కోలాహలము, బిడ్డల ఝూంకార ధ్వనులు, పురుషుల భీకర వాక్పటుత్వములు చెలరేగి, 'ఇటలీ-అబ్బీనియా' యుద్ధమునకు కదలి కల్లోలములకు కాల్పడిన 1936 యూరపును మఱపించినది.

ఇంతలో స్త్రీల కుర్చీస్థలములో మాకు దగ్గర నుండియే నొక బిడ్డడు తన ప్రయోజకత్వమును, మన ఎం ఎల్. సి.లు ప్రయోజకత్వమును మాటలలో కనబరచినట్లు, రోదనలో చూపసాగించెను. తల్లి ఆబిడ్డనోదార్చలేక లేచి, మాకు ముందువరుసలోనే కూర్చున్న ఒక మహానుభావున్ని పిలచి, "చూడండి. ఈ పిల్లవాడిని తీసుకొండి. మీదగ్గరకు వస్తాడట" అని ఆపిల్లవాడ్ని అందించినది. ఆ మహానుభావుడు పిల్లవాని నందుకొనుచు పిల్లవానితోబాటు తల్లిపైటనుకూడ నందుకుని లాగ నారంభించాడు. 'ఇది ప్రత్యక్ష వస్త్రాపహారణమా?' అని మోహానుడు సగము గొంతుకతో మాలో మాకు వినబడు లాగున అన్నాడు. ఇంతలో టక్ అని దీపములు ఆరిపోయినవి.

"ఎవరోయి ఆ మహానుభావుడు" అని నేను మోహానుడ్ని నెమ్మదిగా అడిగాను. కాని నా మాటలు అవ్యక్తికి వినబడ్డది. తన పెద్దమీసముల నొకసారి దువ్వుకుని, "నేను ఎ. ఎం. ఏ. సి. (A. M. A. C.)ని" చెప్పాడు. అదేదో నాకర్థమువలేదు. మోహానుడు ఆలోచించి అతనిని చూచి,

"ఏమి మేసారండి" అని మోహానుడని నవ్వాడు.

చూడబోతే ఆ మహానుభావుడు షూవూరి ఆయుర్వేదడాక్టరు బహు గ్రంథకర్త.

మెయిల్ ఆగినవెంటనే మెయిలునకు మించినగోల ప్లాటుఫారముమీద కనుపిస్తుంది. ఆలాగునే టక్ అని దీపములు ఆరిపోగానే, సినిమాచూచు ఆదుర్దాచేననండి, సంబరముచేననండి ఏదో వొకవిధముగా ఈలలు, కూతలు, కేకలు యింకా చిత్ర చిత్ర రకాల అరుపులు, కుక్క అరుపులు, నక్కకూతలు ప్రజలనుండి చెలరేగి సినిమాహాలు కప్పురేకులవఱకు లేచి ప్రతిధ్వనించినవి.

"ఇదేమిగోలరా" అని మోహానుడన్నాడు, చెవులు మూసుకుని.

"ఇదే సినిమాగోల" అని డాక్టరన్నాడు.

"ఎప్పుడన్నా మీ పటంలో చూపారా" అని మోహానుడు మా ఆర్టిస్టు నడిగాడు.

"పటములగోల వేరేవున్నదని" ఆర్టిస్టు నవ్వాడు. ఇంతలో ఫిల్ము జరుగుచున్న చప్పుడయినది.

మొదటిభాగము ఆరంభమయినది. ఏమిటో కృష్ణుడు పాటలలో దిగాడు. దాని భావమేమిటో అతనికే తెలియవలయును. కాని నాకుమాత్రము 'దీనిభావమేమి తిరుమలేశ' అనే సమస్య ఎదురైనవి. మోహానునకు అసలే అర్థమవలేదు.

"ఏమిట్రా. కృష్ణుని గోల" అని నాతో అన్నాడు.

"ఏమీ లేదులే గోల" అని నేను నెమ్మదిగా అన్నాను.

"బాగా చెప్పితివి. సినిమావారు 'లౌ' (Love)ను ఒక్కపెద్ద గోలక్రింద చూపుచున్నారు. తేలికగా కృష్ణుడు దొరికెనని, అతనిచేత నాలుగు ప్రేమగీతములు పాడించి, సత్యభామతో జతగూర్చుటా ఏమి సినిమావారు చేసేది. అసలు యీ ప్రేమఘట్టమునకు 'ద్రౌపదీవస్త్రాపహరణము'నకు గల సంబంధమేమి" అని కొంచము కోపముగనే నొక్కి చెప్పాడు.

"సీ మోహాము. అదికాదు. కృష్ణుడనేవాడు యీ నాటకమునకొక ముఖ్య పాత్రధారి. దానికి ప్రాముఖ్యత నిచ్చి పాత్రను స్థిరపఱచుటకు యీ ఘట్టమును కల్పించిరని" నేను మోహానుని సమాధానపఱుప జూచాను.

"శ్రీకృష్ణుని పాత్రను ప్రాముఖ్యతలోనికి దెచ్చుటకు యీ ప్రేమఘట్టమేనా సినిమా వారికి కనుపించినది" అని మా డాక్టరు కొట్టుటకు వచ్చినంత గట్టిగా నాతో అన్నాడు.

"శ్రీ కృష్ణుడు ప్రేమ స్వరూపుడండి" అని మా ఆర్టిస్టు అన్నాడు.

"ప్రేమ అనగా ఆడదానికి పురుషునకు సినిమా పాటలతో అంకురించు పిచ్చి ప్రేమనా అర్థముచేసుకున్నారు. సినమాలువచ్చిన వెనుక పౌరాణికగాథల పరువు శుభ్రముగ పోవుచున్నది. ప్రేమ అన 'దయ', 'భూతదయ' 'కారుణ్యము' అనే భావము మాని 'మోహము', వలపు కామము అనే ధోరణిల్ తీసుకున్న రసజ్ఞతేముండును" అని తానొక గొప్పరసజ్ఞునివలె మోహనుడు చెప్పనారంభించెను. మోహనునకేమి చెప్పవలెనో నాకు తెలియ లేదు. 'చూడురా. సత్యభామ ఎంత లజ్జతో' ఎంత బెట్టుతో, ఎంత సొంపుతో, అతివయ్యారముగా అభినయించుచు, అభినయమును మించి పాడుతూ శ్రీకృష్ణుని మెడలో పూలదండ వేయుచున్నదో" అని నేను మోహనునకు జూపాను.

"ఓ. చాలా బాగుగావున్నది. తెరమీద భాగవతమును ఆడించారు. సినిమావారు" అని డాక్టరన్నాడు.

"వాడెవడోయి. అంత తెలివితక్కువగా ఆడవారి మీద బడ్డాడు" అని మోహనుడన్నాడు.

"అతను శ్రీకృష్ణుని చెలికాడు. అతను పడినది సత్యభామ చెలికత్తెయలమీద. మరి హాస్యమనునది ఏలాగున వస్తుంది యిటువంటివి జరుగకపోతే" అని నేను అన్నాను.

ఇంతలో అర్జునుడు రావడము. అతడెందులకు వచ్చెనో సవిస్తరముగ దెలియకనే, ఆభాగము పూర్తి అవడము సంభవించినది.

"కావలసిన భాగమును పెంచి చూపకుండ అనవసరభాగమును పెంచి చూపారు సినిమా వారని" మోహనుడన్నాడు.

"అవసర భాగమేమిటి. అనవసర భాగమేమిటి" అని నేను అన్నాను.

"అర్జునుడు వచ్చి మేము రాజసూయ యాగమును సంకల్పించుకున్నాము. దానియొక్క వుద్దేశమిది. మీరువచ్చి ఆకార్యమును నిర్వహించవలెను అని ఆభాగమును పెంచి చూపవలసినది" అని మా ఆర్టిస్టు అన్నాడు.

"ఇదంతా తెలిసినదనే అనుకొనవలెను" అని నేను అన్నాను.

"ఇదంతా తెలిసినదని అనుకొనిన, సినిమా వైఖరే తెలిసినదని అనుకొనవలెను" అని మోహనుడన్నాడు.

రెండవ భాగము ప్రారంభమయినది. శిశుపాలుడు మధువును సేవించు రంగమది. బాలనర్తకి మధుకలశమును జేకొని, శిశుపాలుని సమీపించుచు, ఒకేరాండ్లు కొట్టుచూ వస్తూవున్నది. శిశుపాలుడు అతని స్నేహితులు నలుగురు ఆనర్తకిని చుట్టవేసి మద్యము కొఱకు చిందులు త్రొక్కుచుందురు. ఇది ఏ అరేబియన్ ఇమిటేషనో అని నేను ఆలోచనలో బడ్డాను. మోహనుడు నాఆలోచనను భగ్నముచేసాడు.

"చూచావురా. రాజు రాజుకళ శిశుపాలునిలో గనుపఱచక అతనిని సారాబచ్చా క్రింద జూపారన్నాడు. మోహనుడు.

"ఇంకెలాగున చూపవలెను" అనినేను అన్నాను.

"రాజు ఎంత త్రాగుబోతయినప్పటికి, లోపల త్రాగి స్టేజికి వచ్చిన ఆక్టరువలె గోప్యముగ నుండవలెను కాని దొప్పపట్టుకుని తందనాలాడినట్లు చిత్రిస్తారా. ఎంత అపురదిష్టగా సృష్టించారు శిశుపాలుడ్ని" అని మోహనుడు గోలపెట్టాడు. ఇంతటితో సరిపోలేదు. యదుకాంతలను శిశుపాలుడు చెఱబట్టి చెఱుపజూచినట్లు, ఆసమయమున నారదుడు పాటతో దిగివచ్చి, ఓ తెలివితక్కువ శిశుపాలా యదుకాంతలను పట్టుకున్న నీకెట్టి ముక్తివున్నది శ్రీకృష్ణుని భార్యలను జెఱబట్టవోయి, అని సలహాయిచ్చినట్లు పటమున జిత్రింప బడినది.

"వెఱ్ఱి శిశుపాలునకు అప్పుడు స్ఫురించినది. అది మహామంచి ఆలోచనని" మోహానుడన్నాడు.

"శిశుపాలుని చవట పెద్దమ్మను చేసారు. ఇంకొక శిశుపాలయితే యదుకాంతలను జెఱబెట్టెదను, శ్రీకృష్ణుని భార్యలను చెఱబట్టెదను, నిన్నుగూడ జెఱబట్టెదనని నారదునిని కూడ జెఱబట్టేవాడు" అని డాక్టరన్నాడు నవ్వుచు, ఆనవ్వు అతని పెదవులలోనే అణగి పోయేలాగ.

"ఎంత చవట రాజయితే మట్టుకు, శ్రీకృష్ణునిపై చూపవలసిన పగను అతని భార్యలపై చూపనుద్యుక్తుడవునా?" అని మా ఆర్టిస్టు అన్నాడు.

"స్త్రీలు లోకువయ్యా. నీవు ఏ కుఱ్ఱవాడికైన లెంపవెట్టుయిచ్చి చూడు, 'నీఅమ్మ' నీ ఆలి......అని పురాణమెత్తుకుని వస్తాడు" అని డాక్టరన్నాడు.

"అయితే. యీతత్వము నారదున కొంట బట్టిన దన్నమాట" అని నేను అన్నాను.

"ఆలాగునే కనుపిస్తూవున్నది. ఒకే శిశుపాలుడ్ని తయారు చేసారు టాకీవారని" మోహానుడన్నాడు.

స్టేషన్‌నుండి యింటికి జట్కా చేసుకున్న చెట్లనీడ నుండి, మేడల నీడ నుండి ఒకే జోరుగా పోతుంది జట్కా అంతకన్న ఆడంబరముగాలేదు శ్రీకృష్ణుని ప్రయాణము ద్వారకనుండి హస్తినాపురమునకు. రాజసూయ యాగమునుండి రారాజులందరు హస్తినాపురము చేరుకొను చున్నారు.

"ఏమిరా. ఈ రాజులు రావడమెటులుంది" అని మోహానుడు నన్ను ప్రశ్నించాడు.

"టి. ఏ. ల కొరకు అన్ని రాష్ట్రముల ఎం. ఎల్. ఎ. లు డిల్లీ చేరుకున్నట్లున్నది" అని నేను అన్నాను మోహానుడి వుద్దేశముకూడ అదేమో అనుకుని

"నీమోహాము. దమయంతి ద్వితీయ స్వయంవరమునకు "ధరణింగల రాజులెల్ల దడదడవచ్చిరా" అని గీరశము చెప్పిన ముక్కను అక్షరాల అమలులోనికి దెచ్చుటకు సినిమావారు సకల ప్రయత్నములు చేసినట్టు కనుపించింది" అని మోహానుడన్నాడు.

"అప్పటికి వాడికేమి సమాధానమివ్వ లేకపోతిని. రీలు అవి తొందరగా నడుస్తూవున్నది. శ్రీకృష్ణుని, సత్యభామను పాండవు లాహ్వానించి లోనికి గొనిపోయిరి."

రీలు మారినది. ఇప్పుడు జరుగు చున్నది ద్రౌపదీ సత్యభామల సంభాషణ ఘట్టము.

"ఏమిరా! కొంతవరకు ఈసీనులు 'లవకుశ' ఇమిటేషన్ కాదా" అని మోహానుడన్నాడు.

"కాకేమి" అని మా ఆర్టిస్టు అన్నాడు.

"అక్కడ రామాయణచిత్రములు గోడలమీద చిత్రింపబడినట్లు చూపించారు. ఇక్కడ పాండవుల కష్టసుఖములు "చిత్రింపబడినవి" అని డాక్టరన్నాడు.

ద్రౌపదీ సత్యభామలు అతిస్నేహామున కలిసి తిరుగుచు గోడలమీద చిత్రములను తిలకించు చుందురు. కాని హాలంత విశాలమయినది కాదు.

"ఏమిరా. ద్రౌపది ఎట్లా వున్నదని" మోహాను డడిగాడునన్ను.

"సత్య చాలా పొట్టి. ద్రౌపది పొడగిరి" అని నేను అన్నాను.

"అదిగాదండి! వైఖరిలో" అని డాక్టరందుకున్నాడు

"సత్యలో కొంటెతనము కనుపిస్తూవుంది." అని మా ఆర్టిస్టు అన్నాడు.

"సూక్ష్మములో తెమల్చలేదు. సత్య అల్లరిపిల్ల. ద్రౌపది మొరటు పెంకిపిల్ల" అని మోహానుడన్నాడు.

కాని ద్రౌపదిమాటలలో రసజ్ఞతుంది పాటలోరాగజ్ఞానమేలే, అర్థజ్ఞానముకూడా స్ఫురించినది. పాత్ర నిర్వాహాములో ద్రౌపదికి మంచినేర్పు వున్నదని చెప్పక తప్పదు. ద్రౌపదీ సత్యభామలు కూర్చుని ప్రసంగించుకొను చున్నారు. ద్రౌపదికి శ్రీకృష్ణుని పైగల భక్తికి సత్యభామ ఆశ్చర్యపడుతుంది. తనకు శ్రీకృష్ణుని పైగల భక్తిని వెలిబుచ్చుచు చక్కని పద్యమును ద్రౌపది పాడుతుంది.

"టాకీ ఆరంభము యిక్కడనుంచే అని అనుకొనవలెను" అని మోహాను డన్నాడు.

"అంతకుముందంతా!!" అని మా ఆర్టిస్టు అన్నాడు.

అదంతా చెత్త రబ్బిష్ (Rubbish)" అని డాక్టరన్నాడు.

ఇంతలో శ్రీకృష్ణుడు చెఱుకు తినుచు ప్రవేశిస్తాడు.

"ఇదేమిరా శ్రీకృష్ణుడు చెఱకు తినుచు ప్రవేశించాడు" అని మోహానుడన్నాడు ఆశ్చర్యముతో.

చెఱుకంటే నాకూ యిష్టమే నండి" అని మా ఆర్టిస్టు అన్నాడు నోరూరుతూ.

"చెఱకు పంటికి శ్రేష్టమన్నాడు" మా డాక్టరు, తన పల్లెవాటు కండువా నొకసారి సవరించు కొనుచు.

"గ్రామములకు మఱలండోయి అని గాంధిగారు చెప్పుచున్నారు. గ్రామములలో చెఱుకు తినుట సర్వసాధారణముగా జరిగెడిదే. కనుక చెఱుకును శ్రీకృష్ణునిచే తినిపించుటవల్ల గాంధి ప్రభోధమును కూడా కొంత సాగించిన వారమవుదమని వుద్దేశములో తీసుకుని వచ్చి వుందురని" నా అభిప్రాయమును వారికి తెలియజేసాను.

"అదీకాదు. ఇదీకాదు. ఫిల్మును రథసప్తమి ఆ ప్రాంతములో విడుదల చేసారు. ఆనాటికి చెఱుకులు విస్తారముగ నుంటవి. ఆ జ్ఞాపకార్థముకొఱకు చెఱకును అమలులోనికి తెచ్చుకున్నారు" అని మా డాక్టరు మఱల అందుకున్నాడు.

"అవును. అది 'లోకల్ కలరింగు'కూడ యిస్తుందని" మా ఆర్టిస్టు అన్నాడు.

"మంచి కలరింగే. శ్రీకృష్ణునకు కలర్ వేసి సోఫాలో కూర్చుండబెట్టి చెఱకు తినిపించుట" అని మోహానుడు సణిగెను.

"పెధవ రొమాన్సువలె వున్నది. నీకు ఆవకాయ ముక్క యిష్టమని సిల్కుసూటు వేసుకుని రోడ్డుమీద పోతు చప్పరించు బలే రొమాన్సుగా వుంటుందని" మోహానుడన్నాడు.

బ్లేడుతో పెన్సిలు చెక్కుకుంటూ చేయికోసుకున్న కుఱ్ఱవానివలె, శ్రీకృష్ణుడు చెఱకు తింటూ తింటూ, చేతికి చెఱకుపేడు గ్రుచ్చుకున్నదంటాడు. రక్తము కారుచున్న చేతితో, సత్యభామ ద్రౌపదలు వద్దకు వచ్చును.

"నాకు వచ్చిన అవస్తే శ్రీకృష్ణునకు వచ్చినవి" అని డాక్టరన్నాడు.

"ఏమన్నాను" నేను.

"నిన్న తియ్యమామిడికాయ చెక్కు తీస్తూవుండగా చేయి తెగింది" అని డక్టరన్నాడు.

"అయితే" అని మాఆర్టిస్టు అందుకున్నాడు.

"కాయను కత్తిని బల్లమీద పెట్టి! గుడ్డ గుడ్డని యింటిలోనికి పరుగెత్తాను. అక్కడాక ట్రాజడీ అయినది" అని డాక్టరన్నాడు.

"ఏమిటా ట్రాజెడీ" అని మోహానుడన్నాడు.

"గుడ్డలు దగ్గర పెట్టుకొని కూర్చున్నానా చేయి కోసుకునివస్తారని. వుండండి కాసేపు వెదికితెస్తానని మా ఆవిడ అన్నది" అని డాక్టరన్నాడు.

సత్యభామ గుడ్డకొఱకు లోపలకు పఱుగెత్తింది ద్రౌపతి కొంగు తడుముకుంది చింపికట్టుటకు.

"ఆచింపికట్టుటలో చురుకుదనముండవలెను. దృష్టి కృష్ణునిగాయముపై వుంచి తానేమి చేస్తున్నదో తనకేమి తెలియనట్లు చఱ్ఱున కొంగును చింపవలెను" అని మోహానుడన్నాడు.

"ఇప్పుడేమిలోటు వచ్చినది" అని అన్నాను.

"కొంగును తడుముకుని, కొంగునకు కలిపి కుట్టిన గుడ్డ చేతికందినదా లేదా అని చూచి చింపినట్లు చింపినది" అని మోహానుడన్నాడు.

"మాఆవిడ కామాత్రము తెలసినది కాదు"

"కొంగును చింపి గుడ్డ పేలికను తీసి కట్టు కట్టాలని" అని డాక్టరన్నాడు

"నీటిలో తడిపి గుడ్డను కట్టవద్దూ?" అనిమాఆర్టిస్టు వైద్యములో కూడ ప్రవేశమున్నట్లు, చెప్పాడు.

"సినిమాలో తడిపి కట్టారా" అనినే అన్నాను.

"సినిమా వారికేమి తెలుసు. అసలు కృష్ణుడు వ్రేలునకు దెబ్బతగలగానే ఆవ్రేలును నోటిలో బెట్టుకుని చప్పరించిన దెబ్బలో నెత్తురు కట్టేది" అని డాక్టరన్నాడు

"అవును. గోటితో పోవుదానిని గొడ్డలితో తల పెట్టారు సినిమావారని" మా ఆర్టిస్టు అన్నాడు.

"లేకపోయిన ప్లాటు ఎలాగున సాగుతుంది" అని డాక్టరన్నాడు.

"ఇక్కడ ప్లాటేమిటి" అని అడిగాడు మోహానుడు

"ఇక్కడ ద్రౌపది భక్తి విశేషం కనుపిస్తుంది. శ్రీకృష్ణునిపైగల భక్తిచేత కోకను చింపి కట్టు కట్టుతుంది. శ్రీకృష్ణుడు సంతసించి పాటపాడుతాడు" అని నేనుఅన్నాను.

"ఇదీ అరములేని పాటేనా !!" అని మోహానుడన్నాడు, శ్రీకృష్ణుని పాటవిని.

"అర్థమున్న పాటయినా, అర్థములేని పాటయినా పాడడం అరములేకుండానే పాడాలే. లేకపోయిన టాకీకి ముక్తిరాదని" నేను నవ్వుతూ అన్నాను.

పాట పరువు నిలబెట్టవలెననో, మా మోహానుని పరువు నిలబెట్టవలెననో, అనుకోనంత త్వరలో రీలు అయిపోయినది.

రాజసూయయాగము ఆరంభమయినది. హోమమును వ్రేల్చడము, బ్రాహ్మణులు మంత్రములు జదువడము రాజసూయ యాగము పూర్తి అవడము జరగినది.

"అప్పుడే అయిపోయినదా ఏమి రాజసూయ యాగము?" అని మోహానుడన్నాడు

"ఆహా!" అని. నేను తలవూపాను

"హడావడిగ చవితిపూజను పౌరోహితుడు జరిపినట్లు జరిపాడు" అని డాక్టరన్నాడు.

"సూక్ష్మములో మోక్షమన్నాడు" మా ఆర్టిస్టు.

"బలే సూక్ష్మము. సినిమా అన్న బొమ్మలాటని సార్థకము చేసారని" డాక్టరన్నాడు.

తరువాత అర్ఘ్యాధిపతిగ శ్రీకృష్ణుని ఎన్నుకున్నారు. ఇది శిశుపాలుని వధఘట్టము. ఒకే శిశుపాలుడు అచ్చము మూడు మూర్తులా కంసుని తమ్ముడే, ఆపండ్లు బిగబట్టుటలోపదమును సాగదీసి అక్షర మక్షరము విడదీసి చావగొట్టి వుచ్చరించుటలోను.

"పండ్లు బిగబట్టి, ముఖము ఘూంద్రించి, 'వూ', 'ఆ' అని నొప్పులుపడుట శిశుపాలుని తత్వమా!!" అని మోహానుడన్నాడు.

"శిశుపాలుని తత్వముకాదు. నవీన సినిమా స్టేజి తత్వము. అతడంత అభినయించకపోతే క్రోధము సినిమా కెమేరా కెక్కదికాదు అని అతనిభావము" అని మా డాక్టరన్నాడు.

"ఆ. ఆ. ఆగండి. ఆగండి" అని మోహానుడు ఏదో చెప్పబోయేలాగున ఆపి, మునిసిపల్ ఆఫీసులో మెంబర్లు 'నీవు ఫూల్' అంటే 'నీవు ఫూల్' అనుకున్నట్లు, శ్రీ కృష్ణుడు శిశుపాలుడు తిట్టుకుంటున్నారు" అన్నాడు.

చూడబోయిన వారిసంభాషణ సారస్య మంతకన్న హెచ్చుస్థితిలోనే కనుపించినది. 'చప్ నోరుముయ్యి' అంటె 'చప్ నోరుముయ్యి' అనే స్థితిలోనికే వచ్చింది.

"మాడరన్ టెన్‌డెన్సీ (Modern Tendency) బాగా కనుబడ్చారోయి రాజసూయ యాగములో" అని డాక్టరన్నాడు.

"రాజసూయ యాగసభను మాడరన్ టిపికల్ మునిసిపల్ సభవలె చూపారు" అని మా ఆర్టిస్టు అన్నాడు.

"మునిసిపల్ ఆఫీసులో పార్టీల బలమున్నట్లు, భీముడు విజృంభించడము, గదత్రిప్పడము, చెప్పబడడము" యివన్నీ పసందుగా జూపారు సినిమావారని డాక్టరనుచున్నాడు.

అవన్నీ వున్నవికాని, మునిసిపల్ సభలలో ఖూనీలింతమట్టుకు లేవు. ఇప్పుడు జరుగబోతుంది ఖూని. వుండండి" అని మోహానుడన్నాడు.

కృష్ణునకు కోపమొచ్చి 'వూ. చక్రమన్నాడు'. ఆకాశము బ్రద్దలయినది. భూమి పటపట లాడినది. కారు మేఘములు క్రమ్ముకున్నవి. మెఱపులు బలసైనవి. గాలి

విమాన ఎయిర్‌డ్రోమ్ (Areadrome) లోనికి దిగినట్లు విష్ణుచక్రము ఆకాశమునుండి దిగింది. కృష్ణుని మోచేతిలో దూరి వ్రేలువఱకు ప్రాకి గిరగిర తిరిగినది. డర్రున ఎగిరినది. శిశుపాలుడు మెడ సవరించుకుని వెనుకకు తగ్గి తలను పైకెత్తాడు. మెడమీద సునాయాసముగ పడినది. సభలో చూచేవారు చూస్తూనే వున్నారు. సినిమాలో చప్పట్లుకొట్టేవారు చప్పట్లు కొట్టుచునే వున్నారు. డీసెల్ కారు వేగమున చక్రము మఱల శ్రీకృష్ణుని చేరుకున్నది.

"బలే గోలయినదే!!" అని డాక్టరు ఆయాసముతో నన్నాడు.

"ఇంతగోల పెట్టినగాని ఆ భాగము రక్తి కట్టదని" మా ఆర్టిస్టు సంతృప్తిపడ్డాడు.

ఇంతకన్న విచిత్రము నిన్న మాయింటిలో జరిగింది" అని మోహనుడన్నాడు.

"ఏమది" అని డాక్టరన్నాడు.

"నిన్న మాయింటి అరుగుమీద కుక్క పడుకుంది. నేను చూచాను. 'కఱ్ఱ. కఱ్ఱ.' అని అఱచాను. కోటు స్టాండునకు తగిలించి వున్న నాచేతి కఱ్ఱ ఱివ్వ ఱివ్వని యింటి కప్పుమీద కెగిరింది. సర్కసులో హారిజాంటల్ బారుమీద ఆక్టర్లు రౌండ్లు కొట్టినట్లు నాలుగు రౌండ్లు 'జుయ్. జుయ్' అని తిరిగింది. అయ్యాని దిగింది. కుక్కనడుముమీద ఫఢేలనికొట్టింది. 'కుయ్యో, కుయ్యో' అని కుక్క పరుగెత్తింది. చేతికఱ్ఱ నా చేతిలోనికి వచ్చింది" అని మోహనుడు చెప్పాడు.

"ఎవరన్నా నమ్మవొద్దు" అని మా ఆర్టిస్టు అన్నాడు.

"ఇదంతా నమ్మగాలేనిది నేను చెప్పినదేనా నమ్మకూడదు" అని మోహనుడన్నాడు.

"ఏమన్నా అదంతా లేనిపోని గందర గోలమని" ఆర్టిస్టు అన్నాడు చిట్టచివరకు.

"ఆమాత్రము గందరగోలమని లేకపోయిన సినిమా అనే అనుపించుకోదు" అని నేను అన్నాను.

ఇంతలో ఆరీలు గడచిపోయినది.

మయసభలోని చిత్రములను వీక్షించుటకు దుర్యోధనుడు ప్రవేశించాడు. గుమ్మము వద్దనే కాలువవలె కనుపించినది. అతి జాగ్రత్తగా అడుగుమీద అడుగు వేసుకొనుచు ప్రవేశిస్తాడు. ఇంతలో నవ్వు వినబడుతుంది. దుర్యోధనునకు కోపము వస్తుంది. హడావిడిగ బోయి గుమ్మమనుకుని అద్దమునకు తల తగిలించు కుంటాడు. వేగిరపాటున వెనుకకు తిరిగి రాబోయి హాలు మధ్యనున్న గచ్చునీటి కుండీలో పడుతాడు ఇదంతయు తెరమీద కనుబడుతుంది.

"ఏమిరా. ఈసీను విషయమై నీవుద్దేశమేమని" మోహనుడు నన్ను అడిగాడు.

"ఈసీనుకేమి. దివ్యంగా వున్న"దన్నాను నేను.

"మయసభ చిత్రములను బాగుగా కనుబర్చారని" మా ఆర్టిస్టు అన్నాడు.

"దుర్యోధనుని భంగపాటు చాలా బాగా చూపారన్నాడు" మా డాక్టరు.

"స్కూళ్ళలో డిసిప్లిన్ తక్కువయినట్లు, యీసీనులో డిసిప్లిన్ (శిక్షన) తక్కువలేదా?" అని మోహనుడడిగెను.

"ఏమి" అని డాక్టరు ప్రశ్నించాడు.

"ఎంత చెడ్డను మహారాజు కుమారుడు దుర్యోధనుడు. గుమ్మము క్రిందనే నీరున్నదని అనుకుని అడుగుమీద అడుగు బెట్టుచు ప్రవేశించెనని అనుకుందాము, అతని వెంట ప్రవేశించి ద్వారమువద్ద ఆగినసేవకుడు అంత విఱగబడి నవ్వటా!!" అని మోహనుడన్నాడు.

"అవును" అని మా ఆర్టిస్టు తలవూపాడు.

"తరువాత. మేడపై నుండి ద్రౌపది చెలికత్తెయఱు దుర్యోధనుని చూచి నవ్వెరని అనుకుందము. ద్రౌపది వచ్చి వారినోరులు మూసి తప్పని సూచించినది బాగానే వున్నది. కాని కాసేపటికి మఱల నవ్వుదురా మరీ గట్టిగా!! ఇది డిసిప్లినుకు భంగము కాదా? అని మోహనుడన్నాడు.

"ఆహా! తప్పకుండ డిసిప్లెనుకు భంగమే." అని డాక్టరన్నాడు.

"అసలు దుర్యోధనునిలోనే సెల్ఫు డిసిప్లిన్ (Self Discipline) తక్కువని" నేనేదో చెప్ప బోయాను.

"దుర్యోధనునిలో సెల్ఫు డిసిప్లినేవుంటే అసలు కథేలేదు" అని డాక్టరన్నాడు.

"తరువాత వినండి నీటిలో బడ్డ దుర్యోధనుని ఒక్కడ్నిచేసి భీమార్జునాదులు నలువురు ఏకమయి, అన్న దమ్ములనే వరుసకూడ గణింపక, యువరాజుగారు జలక మాడారు గాబోలు: ఆహాహా! అని పరిహాసము చేయుడము పాండవులలో డిసిప్లిన్ లోటు కనుపించదా?" అని మోహాను డన్నాడు.

"అయితే అవుతుంది" అని నేను అన్నాను.

"అవుతుందేమిటి. అయినది" అని మా డాక్టరందుకున్నాడు.

"అదేమి కోపమోయి దుర్యోధనుడిది. నన్ను మించిపోయెను అదరిపాటులో" అని డాక్టరన్నాడు.

"ఏమి" అని నేను అన్నాను.

"మన్న డ్రాయరుపై పెట్టిన ఉత్తరము కనుపించ లేదు. డ్రాయరు సొరుగులను తీసి చూసినితి. ఎక్కడ కనుపించలేదు. కోపమువచ్చి సొరుగులలో నున్న కాగితములంత" యివతల కొట్టాను. బీరువలోని వైద్య గ్రంథము లన్ని దీసి యివతల కొట్టాను. ఇంతలో 'ఏమండి ఏమి పోయినదని' మా ఆవిడ వచ్చినది. 'సీ మోహాము పూరుకో' అని కేకవేసి అదమాయించాను" అని డాక్టరన్నాడు.

తనను మేలుకొలుపవచ్చిన ప్రభాత కన్యలను దుర్యోధనుడు పెద్ద అంకెవేసి అడల గొట్టాడు. ఏదో పాటపాడి వృద్ధిరిద్దామనుకుని కట్టగట్టుకుని వచ్చిన ప్రభాత కన్యలు దబ్బునపడి ముక్కలై చెదిరిన పింగాణీ ముక్కలు వలె చెదిరి పూరుకున్నారు. ఏదో యోగ క్షేమముల నడుగవచ్చిన భానుమతిపై సట్టునలేచి బెదరగొట్టాడు.

"ఇదంతా మామూలే" అని మా ఆర్టిస్టన్నాడు.

"ఇక మామూలు కానిదేది" అని నేను అన్నాను.

"క్రోధమును నోటినుండి వెడల గ్రక్కించవలెను శరీరములో క్రోధమును పూరితమైనట్లు సినిమా నందగు పట్టవలెను." అని ఆర్టిస్టు అన్నాడు.

దుర్యోధనుడు పెద్దపెద్ద సమాసములతో గాంభీర్యమైన గద్యమును మిగుల ఆవేశముతో చదువును. మంచముపైన కూర్చున్నవాడు ఎగరెగరి కూర్చునుచుండును.

"చూచారా. ఎన్నిసారులు పఱుపుపైన తూలి తూలి కూర్చును చున్నాడో. అది కోపలక్షణము బాగుగా నగుపఱచెను" అని మా ఆర్టిస్టు అన్నాడు.

"అతను చదివిన వచనము కూడా మహా సారస్వముగా వున్నది" అని డాక్టరన్నాడు.

"మీకేమన్నా ఆ వచనము అర్థమయినదా? నాకవలేదని మోహాను డన్నాడు.

ఆ. ఆ అర్థముయేదేమిటి. అర్థము జేసుకొనవలెను" అని డాక్టరు నెమ్మదిగ సని పూరుకున్నాడు.

దుర్యోధనుని మనోక్లేశమును ఆర్చను తీర్చను నేనే సమర్థుడనిన శకుని యీరీలులో దర్శనమిచ్చెను. కాని పులిని మచ్చి జేయుటకు "సర్కసు ఎరీనా" లోనికి దిగిన సర్కసు మేనేజరువలె అవస్థపడును. చివరకు శకుని ప్రోద్బలమయినది.

"ఇక్కడ సినిమావారు ఒక అర్టు చూపారన్నాడు" మా ఆర్టిస్టు.

"ఏమి" అని నేను అన్నాను:

"చేపగాలమున చిక్కుముందు, ఎఱదగ్గరకు వస్తుంది పోతుంది. ఆలాగుననే దుర్యోధనుడు శకుని వలలో బడుటకు ముందు వెనుకకూ ముందుకూ అదే తిరుగుతాడు. ఈ అవస్థను బాగుగా చూపెట్టారు సినిమా వార"ని మా ఆర్టిస్టు అన్నాడు.

(తరువాయి 3౯-వ పేజీలో)

# ద్రౌపది వస్త్రాపహరణము

(3౪-వ పేజీ తరువాయి)

"ఆహా, బలే అవస్థలు పెడుతారు సినిమావారు. అందులో సందేహము లేదని" మోహాను డందుకున్నాడు.

తరువాత, పాండవులను హాస్తినాపురమునకు బిలిపించుటకు దృతరాష్ట్రుని అంగీకారము, విదురుని సందేశము మొదలుగాగల రంగములు చూపబడినవి. ఇప్పుడు చూచుచున్న రంగము 'ద్రౌపది కల.' కలలో ద్రౌపదిని భూతమొకటి కొనిపోయినట్లు నిండుసభలో నిలబెట్టినట్లు వలువలు విప్ప ప్రయత్నించినట్లు జూపబడినది.

"అంతా కలలోనే అయిపోయిన యిక కలెందుకు" అని మా డాక్టరన్నాడు.

"ఏమండి ఆర్టిస్టుగారు, యీ కలను చూపుటలో టాకీవారి వుద్దేశమేమయి వుండును" అని మోహాను డడిగాడు.

ఏమి చెప్పుదుమా అని మా ఆర్టిస్టు ఆలోచిస్తున్నాడు.

"ముందు జాగ్రత్తగా నుండుమని ద్రౌపదికి సూచించుటకు" అని నేను అన్నాను.

"ద్రౌపదీ. నీకు ముందు ముందు యిటువంటి అవస్థ వస్తుంది. జాగ్రత్తగా నుండుసుమా?" అని హెచ్చరించుటకా?" అని మోహానుడన్నాడు.

"'ఏమండోయి, మీకీ సంవత్సరములో జబ్బు చేస్తుంది. చచ్చిపోతారు. జాగ్రత్తగా వుండండి' అని సిద్ధాంతులు చెప్పినట్లు" అని మా డాక్టరందుకున్నాడు.

"చచ్చిపోయేవాడు జాగ్రత్తగావున్నా చచ్చిపోతాడు" అని నేను అన్నాను.

"జాగ్రత్తగా చచ్చిపోవుటకు" అని మోహాను డనినవ్వాడు.

"మొత్తముమీద కల యిక్కడ అవసరమేమో" అని మా ఆర్టిస్టు చల్లగానని వూరుకున్నాడు.

ఇంతలో ఆ రీలు గడచిపోయినది.

ఇప్పుడు చూస్తూవున్నది ద్రౌపది తులసిపూజ ఘట్టము. ద్రౌపది ఏడుస్తూ తులసికి పూజచేస్తూవుంటుంది.

"మొదటినుంచి చివరవరకును యిలాగునే తగలెట్టారు ద్రౌపది" ననీ మా డాక్టరన్నాడు.

"ఇంకేలాగున తగలెట్టవలెను" అని మోహానుడన్నాడు.

"ద్రౌపదికి లేనిపోని వ్యసన పిశాచమును తగిలించారు. ద్రౌపదిలోవున్న వుత్సాహము, సంసార సుఖము, ఇవన్నీ తగలెట్టి తులసికోటపూజ, ఏడుస్తూ పాట యివి కల్పించారు. ఇప్పటికి నాలుగు సార్లు చూపారు తులసిపూజసీను. "చివరకు తులసి ఏమన్నను తన్ను కాపాడినదా?" అని డాక్టరు కొంత వుద్రేకముతోనే అన్నాడు.

"శ్రీకృష్ణ తులాభారములో రుక్మిణి పరువు నిలబెట్టినది యీ తులసిపూజే" అని నేను అన్నాను.

"అయితే పిడుగునకు బియ్యమునకు వొకేమంత్రమన్నట్లు ద్రౌపదికి తులసికోట పూజే రుక్మిణికి తులసికోట పూజేనా!! అంటగట్టవలసినదని" డాక్టరన్నాడు కోపముతో.

మా డాక్టరుగారి అభిప్రాయమేమో సవిస్తరముగా తెలిసినది 'శ్రీకృష్ణ తులాభారమందలి తులసీసీనులను వస్త్రాపహరణములోనికి టాకీవారెందుకు తెచ్చుకొనవలెననే' వుద్దేశమేమో. మొత్తముమీద ద్రౌపది తత్వమును టాకీవారు మార్చేసారు. ద్రౌపదియందు భక్తి వైరాగ్యాలెక్కువగ చూపారు.

ఇంతలో పరిచారిక ప్రవేశించి, విదురుడు పంచ పాండవులతో ప్రసంగించుచున్నట్లు చెబుతుంది. ద్రౌపది ఆత్రముగ వారి సంభాషణము వినుటకు వెళ్లును.

తరువాత జూదరంగము అగుపడినది. ఈరంగము మూడు నాలుగు రీల్సు ఆక్రమించినది. అమరికలు సొందిక

గనే వున్నవి. ఈ రంగములవల్లనే టాకీకి ముక్తి వచ్చినది. దృతరాష్ట్రుడు సింహాసనము నాక్రమించి వుండెను. ప్రక్కన విదురుడు నిలుచునివున్నాడు. జూదమాడుటకు దృతరాష్ట్రుడు అనుజ్ఞయిస్తాడు అధర్మము తల నెత్తినప్పుడల్ల విదురుడు ఖిన్నుడై దృతరాష్ట్రునితో 'జూదమాడింపు'మని అడుగుతూవుంటాడు. కాని దృతరాష్ట్రుడు వైస్రాయివలె కూర్చుని 'ఆ, పరవాలేదు. తమాషాకుఆడుకొనుచున్నా'రని సరిపుచ్చుచూ వుంటాడు. పందెపందెమునకు అధర్మము తలఎత్తుట, ధర్మమడుగంటుట జరుగుతూవుంటుంది. పాండవులు వోడిపోతారు. ఇది రసపట్టు. 'మరొక్కపందె'మంటాడు శకుని. ఈ పందెములో ద్రౌపది నొడ్డమంటాడు. గెలచిన పంచపాండవులకు విరవాడ జైలునుండి విముక్తి కలిగినట్లు విముక్తి. ఓడిన ద్రౌపదికి దాస్యము.

పందెము సాగుతుంది. అపజయము పాండవులకే సిద్ధిస్తుంది. దుర్యోధనాదులు గర్జిస్తారు. విదురుడు గోల పెడ్తాడు పంచపాండవులు ఖిన్నులై తలలు వాల్చి కూర్చున్నారు. దుశ్శాసనునకు 'ద్రౌపదిని తీసుకునిరా' అని దుర్యోధనుడు ఆజ్ఞాపిస్తాడు. ఇక ద్రౌపదీ వస్త్రాపహరణ ఘట్టము ప్రారంభమవుతుంది.

"దుశ్శాసనునిలో చురుకుపాలు ఎక్కువ" అని డాక్టరన్నాడు.

"అలాగుననే వున్న"దని మా ఆర్టిస్టు అన్నాడు.

"రా తీసుకునిరా అన్నప్పుడు పోయి జబరదస్తీగా ద్రౌపదిని రెక్కపట్టుకుని రావద్దు. పోలీసు ట్రెయినింగు ఆరునెల్లన్నా యిచ్చినగాని పనికిరాదు" అని డాక్టరన్నాడు

"ఏమి. అంతకన్న ఎక్కువపనే చేస్తున్నాడు. జుత్తుపట్టుకుని లాగుకొని వస్తున్నాడు" అని నేను అన్నాను.

సభలోనికి ద్రౌపది పాటలో ఏడుస్తు ప్రవేశిస్తుంది. 'ధర్మజుడు తన్నోడి నన్నోడెనా, నన్నోడి తన్నోడెనా' అని ద్రౌపది ఏడుపుమానేసి అడుగుతూంది. 'కిత నాస్తి' ఎవరూ మాట్లాడరు.

"ఇదేమి సభోయి. హోమము మెంబర్లవలె కూర్చుని ఎవరూ మాట్లాడరేమి" అని డాక్టరన్నాడు.

"మౌనం అర్ధ అంగీకారము. ఇక వేరే చెప్పేవేమిటి" అని నేను అన్నాను.

"అయితే వాళ్లకు నోళ్లులేవా?" అని మోహనుడన్నాడు.

"కారపుశనగలు తెచ్చిన తెరచుకుంటవని" నేను అన్నాను.

వికర్ణుడు లేచి ఏదో సమాధానమిచ్చాడు ద్రౌపదికి ఇంతలో దుర్యోధనుడు ద్రౌపదికి తన తొడచూపి, తొడమీద కూర్చుండబెట్టుకొందునను భావము తేలుస్తాడు ఇక్కడ భీమునిపార్టు వున్నది.

"చచ్చాము భీములకిక్కడ పద్యమున్నదా ఏమి బద్రాచలము లాంచి బయలుదేరేముందు చేస్తూవున్న అడావిడి కన్న ఎక్కువ హడావిడి భీముడు చేస్తున్నాడు" అని డాక్టరన్నాడు.

"అవును. ఈ పద్యములో దుర్యోధనుడు చరచిన తొడను గదతో మోది, విఱుగగొట్టి దుర్యోధనుని కూనీ చేసెదనని భీముడు ప్రతిజ్ఞ పట్టును" అని నేను అన్నాను.

"ఇది చాలా గాంభీర్యమైన పద్యమన్నాడు" ఆర్టిస్టు. క్రొధములో, కోపములో, ఆవేశములో ఆ పద్యము భీమునిలోనే జలజలలాడి భీముని గొంతుకులోనే చిక్కడి పోతుందేమో అని నాకనిపించినది. కాని ధర్మార్జును లొకచెయ్యి, నకుల సహదేవులు మరొకచేయి గట్టిగా పట్టుకుని, ఆ పద్యమును ఆకేపన్‌తో సహా భీమునిచే చదివించారు.

"ఒరే భీముడు చంపేసాడు" అని మా ఆర్టిస్టు అన్నాడు తానే పాడి వుక్కిరిబిక్కిరైనట్లు.

"చంపేసాడా మరీ చంపేసాడా. పద్యము పూర్తిగా చచ్చిపోయిందన్నాడు" మోహనుడు.

ఇంతలో దుశ్శాసనుడు ద్రౌపదీవస్త్రాపహరణమునకై ఆమె కొంగును పట్ట సిద్ధపడ్డాడు. ఇంతవరకు హడిలుచున్న ద్రౌపది, 'వూ. లాగు' ఏమాత్రము లాగెదవో' అన్నట్లు దశ్శాసనునకు కొంగొచ్చి వూరుకున్నది.

"సినిమా గాబట్టి సరిపోయినది. రెండుచేతులతో కొంగును బట్టుకుని గడ కఱ్ఱవలె నిలబడిపోయింది" ద్రౌపది!! అని డాక్టరన్నాడు.

"రవివర్మ బొమ్మలో ద్రౌపది యీలాగుననే నిల్చున్నది" అని నేను అన్నాను.

"ఆ బొమ్మలో కుచెళ్ల వద్ద నొక చేయి బట్టి కుచెళ్లు వీడకుండ కాచుకున్నది. మరియొక చేతితో కొంగును లాగి పట్టి వుంది" అని మా ఆర్టిస్టు అన్నాడు.

"ఏదీ నేను కొంగుపట్టి లాగుతాను. ఏస్త్రీ ఆలాగున స్థాయిగా నిలబడుతుంది" అని మోహానుడన్నాడు.

"ద్రౌపదిలో ఒకటి కనిపిస్తూ వుంది" అని మా ఆర్టిస్టు చెప్ప నారంభించాడు "ద్రౌపదిలో జాలి పుట్టించు చూపులంత కనుపించవు. మొండితనము కనుపించినది".

"అయితే. రెండు కనుపించిన వన్నమాట" అని డాక్టరన్నాడు.

"కలలోనే యీ అవస్థ కలిగినది కాబట్టి కంగారు తగ్గిపోయినది ద్రౌపదికి" అని నేను అన్నాను. ఇంతలో బాంబు ప్రేలినంత ధ్వని వినిపించినది. చూడబోయిన, శ్రీకృష్ణుని మహత్యము వలన ద్రౌపదికి వలువలు వస్తూ వున్నవి.

"బలే అరేంజిమెంటు" అని డాక్టరన్నాడు.

"ఏమిరా ఆ అరేంజిమెంటు దుశ్శాశనుడు చూచాడా?" అని మోహానుడు నన్ను ప్రశ్నించాడు.

మొండి ప్రశ్న వాడికి సమాధానమేమిచ్చేది. "సినిమా అరేంజిమెంట్లు దేవతా వస్త్రములవలె కొందరి కగుపడ వలెను కొందరి కగుపడ కూడదు" అని దబాయించి చెప్పాను.

దుశ్శాశనుడు ద్రౌపది వలువలను దూసిదూసి అలసివుంటాడు. ప్రపంచము తలక్రిందుగా తిరిగినట్లు కనుపిస్తుంది. ద్రౌపది తల దూసిన వలువలపై బడి సొమ్మసిల్లును.

ఇప్పుడు ద్రౌపది గొంతుకు లేచును. 'నాథు బింధు కళా...' అను పాట నందుకుంటుంది.

"ఏమిరా ఇది ప్లేట్ల పాటకాదా' అని మోహానుడన్నాడు

"అవును ప్లేట్ల పాటే అయితేనేమి" అని నేను అన్నాను.

"ఏమీ లేదు. రోజు వింటున్నపాట. వినుటకు విసుగుండదా" అని మా డాక్టరన్నాడు.

"అయితే ఆ వచ్చాను. కాని పాడుటలో శ్రావ్యమున్నదని" మా ఆర్టిస్టు అన్నాడు. ఏది ఎటులున్న పాట బాగానే వున్నది. కాని ఒక అవస్థ సిద్ధించినది. పాట అవకుండానే రీలు ఆగిపోవడము, గుడ్నైటు లైట్సు (Good Night Lights) మాయిరాద బడటము సంభవించినది.

"ఏమిరా! లెగువింక. ద్రౌపది వస్త్రాపహారణమయి పోయిందన్నాను" మోహానునితో నేను కుర్చీనుండి లేచుచు. మోహానుడు జోడుత్రాళ్లు బిగించుకొను చున్నాడు.

"కథ కొంచము, హడావిడి జాస్తి అయిపోయింది" అని మా ఆర్టిస్టు అన్నాడు. నిలబడి వొళ్లు విఱచును.

మోహానుడులేచి, "పద డాక్టరన్నాడు."

"డాక్టరు తన ద్రౌపదిని గేటవతల రిసీవు చేసుకొన వెళ్ళినాడు" అని నేను అన్నాను.

"బలే డాక్టరు. అతను చూపిన ద్రౌపదీ వస్త్రాపహారణమే బాగున్నది" అని మోహానుడన్నాడు.

"అది బొమ్మగీసి భారతికి పంపవలెనని" డాక్టరన్నాడు.

"పంపు బాబు. నీబోటి చిత్రకారులు, మావాడి వంటి కథకులు, మన డాక్టరు వంటి వస్త్రాపహారణ శూరులుండుట వల్లనే ప్రపంచము బాగుపడుతుంది. మనకు కావలసి వుంటే, యీ టాకీవారిని కూడ కలుపుకుందుమని" మోహానుడన్నాడు.

ఈలోపల సినిమా అవుటరుగేటు చేరుకున్నాము. ప్రపంచములో బ్రతికినన్న దినములే అంతా కలిసివుండడము ఆతరువాత ఎవరిత్రోవ వారిదే అనునట్లు సినిమాగేటు దాటగనే మాత్రోవ మాదయినది, మా ఆర్టిస్టు త్రోవ మా ఆర్టిస్టు దయినది.